# వసుంధర 'ట్రిక్'

"అలా ఉన్నావేం?" అని పలుకరించాను గురుమూర్తిని.

"నా భార్యకు తలనొప్పి" అన్నాడు గురుమూర్తి దిగులుగా.

నాకు నవ్వు వచ్చింది. అతడలాగ నడంలో ఈ ప్రపంచంలో జరగరాని ఘోరాపచారం జరిగిపోయిన బాధ, ప్రపంచంలో ఇంతమంది మనుషులుండగా తలనొప్పి తన భార్యకే రావాలా అన్న ఆవేదన ధ్వనించాయి.

"తలనొప్పి పెద్ద ప్రమాదకరమైన జబ్బుకాదు. దానికి దిగులెందుకు?" అన్నాను. అన్నాను కానీ అతడు క్రొత్తగా పెళ్ళయినవాడని తెలిసుండీ ఈ ప్రశ్న వేసినందుకు కాస్త నొచ్చుకున్నాను.

"తల నొప్పి ప్రమాదకరమైనది కాదని నాకు తెలుసు. కానీ అది రోజూ వస్తోంది" అన్నాడు గురుమూర్తి.

"రోజూ వస్తోందా? అయితే ముందు కంటి డాక్టరుకు చూపించలేకపోయావా?" అన్నాను.

"చూపించాను. కళ్ళలో ఏలోపమూ లేదని పంపించేశాడాయన."

"అయితే మరింకే డాక్టర్నీ చూడలేదా?"

"చూశాను. మొత్తం నలుగుర్ని చూశాను. అందులో ముగ్గురు స్పెషలిస్టులు. ఒక్కరుకూడా నాకు సహకరించలేకపోయారు."

"చాలా ఆశ్చర్యంగా ఉందే?" అన్నాను.

"రోజూ ఉదయం అయిదింటికి ప్రారంభమవుతుంది. పది గంటల దాకా ఉంటుంది. అంతసేపూ నొప్పి భరించలేక ఒకోసారి ఏడుస్తుందికూడా."

"పోనీ-ఆస్ప్రో, అనాసిన్, శారిడాన్ లాంటివి ప్రయత్నించి చూడలేకపోయావా?"

"ప్రయత్నించాను. ఏ రోజు బిళ్ళ వేసుకుంటే ఆ రోజు తగ్గిపోతుంది. కానీ మర్నాడు మళ్ళీ మామూలే! రోజూ బిళ్ళలు మింగడం ఆరోగ్యానికి ప్రమాదమని భయం నాకు."

"పాపం-గురుమూర్తి!" అనుకున్నాను మనసులో. పెళ్ళైన కొత్తలో మగాడు ఆడదానికి మరీ

ఎక్కువ ప్రాధాన్యత నిస్తాడు. భార్యలు అది అలుసుగా తీసుకుని రకరకాలుగా ఏడిపిస్తారు. ఇలాగని నేను గురుమూర్తికి చెప్పదల్చుకో లేదు.

"అమృతాంజనం, నోపెన్‌లాంటివి వాడలేకపోయావా?" అన్నాను.

"ఆమె తలనొప్పికి జొత్తిగా పని చేయడంలేదు."

అప్పుడు నాకు అప్పలరాజు గుర్తు కొచ్చాడు.

రోజా ఉదయమే వచ్చి ఆ తర్వాత కాసేపటికి తగ్గిపోయే తలనొప్పి పార్శ్వపు నొప్పి అంటారు. పార్శ్వపు నొప్పి నాకూ ఓసారి వచ్చింది. ఆ బాధ అనుభవించిన వాడికే తెలియాలి. అప్పలరాజు ఏదో ఆకు పసరు తెచ్చి నా నుదుటి మీద మూడురోజులుపట్టుగా వేశాడు. ఆ తర్వాత మళ్ళీ ఇంతవరకూ నా కది రాలేదు. అప్పలరాజు పట్టువేసి నందుకు పైసా కూడా తీసుకోడు. నేను గురుమూర్తికి అప్పలరాజు పేరు చెప్పాను.

ఒక వారం రోజుల తర్వాత గురుమూర్తి నాకు చెప్పాడు- "అప్పలరాజు వైద్యం పనిచేయలేదు."

"ఆశ్చర్యంగా ఉందే?"

"పట్టు వేసేముందు అప్పలరాజు తల నొప్పి లక్షణాలు అడిగాడు. నా భార్యకు పార్శ్వపు నొప్పికాదు. అతడి వైద్యం పార్శ్వపు నొప్పికే పనిచేస్తుందిట. అయినా ఎందుకైనా మంచిదని ప్రయత్నిస్తే-పని జరుగలేదు."

"అయితే నువ్వు అలక్ష్యం చేయడానికి వీల్లేదు. నీకు అభ్యంతరం లేకపోతే మా ఫామిలీ డాక్టర్ ఉన్నది. ఒకసారి నా భార్యను తోడుగా పంపిస్తాను. ఆమె వద్దకు పంపు" అన్నాను.

"ఆవిడ వివరాలు చెప్పండి. మీ కెందుకు శ్రమ? మేమిద్దరం వెళ్ళి వచ్చేస్తాం" అన్నాడు గురుమూర్తి. నేను అతడికి వివరాలివ్వడమేకాక మా ఫామిలీ డాక్టర్‌కి గురుమూర్తి భార్యను శ్రద్ధగా పరీక్షించవలసిందిగా ఫోన్‌చేసి చెప్పాను.

ఆవిడ నాకు నా చిన్నతనం నుంచీ తెలుసు. ఏ జబ్బుకైనా లక్షణాలు వినేసి మందిచ్చే దురలవాటు ఆవిడకు లేదు. ఆవిడ ఊహాశక్తి చాలా గొప్పది. రోగానికి మూల కారణం బయటపెట్టడానికి ఎటువంటి ప్రశ్నలు వేయాలో ఆవిడకు బాగా తెలుసు.

వారంరోజులు తర్వాత మళ్ళీ గురుమూర్తి కనిపించాడు.

"తలనొప్పి ఏదయినా దారికి వచ్చిందా?"



అతగాడిగురించి నా కంత ఆత్రుత ఎందుకంటే-అతడు నా స్నేహితుడి చిట్టి తమ్ముడు. అతడికీ ఊళ్ళో ఉద్యోగం రాగానే నా స్నేహితుడు నాకు ఉత్తరం రాశాడు. ఆ తర్వాత గురుమూర్తి పెళ్ళికి వెడుతూ మంచి ఇల్లు చూసి పెట్టమని నన్నే అడిగాడు. ఇప్పుడతడి భార్యకు తల నొప్పి వచ్చింది. నేను సాయపడ వద్దూ?

"ఏమీ లాభం లేదు. అందరు డాక్టర్ల కిలాగే ఈవిడకీ కేసు అంతు పట్టలేదు" అన్నాడు గురుమూర్తి. మా డాక్టర్‌కి కేసు అంతు పట్టక పోవడమా? ఏదో తిరకాసుందని పించింది.

వెళ్ళి మా డాక్టర్ని కలుసుకుని గురుమూర్తి గురించి అడిగాను.

డాక్టర్ నవ్వి- "అదా, అది కొత్త దంపతుల కేసు" అన్నది.

"అంటే?"

"ఆమెకు చిన్నతనంనుంచీ ఆల స్యంగా నిద్ర లేవడం అలవాటు. ఏడులోపలే నిద్ర లేస్తే ఆమెకు తలనొప్పి వస్తుంది. అంతవరకూ పడుకోనిస్తే ఏ బాధా ఉండదు. కానీ అతని గురించి ఆమె రోజూ అయిదింటికి లేచిపోతున్నదట. ఆ అలవాటు మార్చుకోవాలని సలహా యిచ్చాను" అన్నది డాక్టర్.

విషయం నాకు అర్థమయింది.

పాపం- ఆ పిల్లకు నిజంగానే తల నొప్పి వస్తున్నది. ఈ విషయమై గురుమూర్తిని హెచ్చరించడం మంచిదనిపించింది. కానీ ఎలా? ఒక నిర్ణయానికి వచ్చాను.

గురుమూర్తి ఇంటికీ, మా ఇంటికీ ఒక కిలోమీటరు దూరం ఉన్నది. గురుమూర్తి భార్య అప్పుడప్పుడు మా ఇంటికి సలహా సంప్రదింపు లకు వచ్చి వెడుతూంటుంది. వాళ్ళిం టికి నా భార్య వెళ్ళడానికి టైముండదు.

ఈ సారి గురుమూర్తి భార్య వచ్చి నపుడు విషయం ఆరాతీసి తెలుసుకో మన్నాను. ఇలాంటి విషయాలు ఆడవాళ్ళూ- ఆడవాళ్ళూ మాట్లాడు కున్నంత చనువుగా మగవాళ్ళు మాట్లాడుకోలేరు.

రెండురోజుల తర్వాత నా భార్య నాకు చెప్పింది.

"మన డాక్టరు చెప్పింది నిజమే. కానీ కారణం మీరను కున్నది కాదు."

"అంటే?"

"గురుమూర్తికి రోజూ అయిదు గంటలకల్లా నిద్రలేచే అలవాటున్న దట" అన్నది నా భార్య.

"నీ అదృష్టం- నా కలాంటి అల వాటు లేదు" అన్నాను.

"సరేలేండి! మీకు మంచమెక్కితే నిద్రాదేవేభార్య...." అని గునిసి- "సరిగ్గా అయిదింటికి కాఫీ తాగే అలవాటున్నది అతడికి" అన్నది.

"అయితే?"

"అందుకోసం భార్యను నిద్ర లేపుతాడు. ఆ సమయంలో నిద్రాభంగం కావడంవల్ల ఆమెకు తలనొప్పి వస్తున్నది."

"పోనీ- తను కలుపుకోవచ్చుగా?" అన్నాను.

"పెళ్ళాం లేనప్పుడు ఎలాగూ తప్ప లేదు. ఆమె వచ్చేక కూడా తనకా బాధ ఎందుకూ అంటాడట."

"అయితే రాత్రి కలుపుకుని ఫ్లాస్కులో పోసుకుంటే సరి!"

"పెళ్ళాం వచ్చేకకూడా ఫ్లాస్కులో కాఫీయేనా అని అతడికి పట్టుదల! అతడికి ఫ్రెష్‌గా కాఫీ తాగడం ఇష్టం. అందుకని ఆమె లేచి కాఫీ కలిపి ఇవ్వాలి."

పెళ్ళాం తలనొప్పి కోసం డాక్టర్ల చుట్టూ తిరుగుతుంటే ఎంత ప్రేమో అనుకున్నాను. తను కాస్త చిన్న త్యాగం చేస్తే వదిలిపోయేదానికి, ఇంత హడావిడి చేస్తున్నాడు.

"పాపం! ఆ అమ్మాయి తలనొప్పి కథ అంతే! అసలు మగ వాళ్ళంతా యింతే. స్వసుఖంలోకూడా సద్దు కోరు. అతనా డాక్టర్ల చుట్టూ తిరిగి పెళ్ళాంమీద ప్రేమ చూపించే బదులు, రోజూ ఉదయం తన కాఫీ తను కలుపుకోవచ్చుగా?" అన్నది నా భార్య.

"మగాళ్ళంతా యింతేనని గురుమూర్తితోపాటు నన్నూ కలపకు. నేను అతడి భార్య సమస్యను పరిష్కరిస్తాను" అన్నాను.

మర్నాడు గురుమూర్తిని నేనే ప్రత్యేకంగా కలిసి- "నీ భార్య తలనొప్పి గురించి లేడీడాక్టరు నాకు చెప్పింది. నా మాట విని ఆమె తలనొప్పి గురించి నువ్వింక ఎవరికీ చెప్పుకోకు. నవ్వుల పాలవుతావు" అన్నాను.

"ఎందుకని?"

"స్త్రీకి దాంపత్య జీవితంలో అసంతృప్తి వుంటే రోజూ ఉదయం అలా తలనొప్పి వస్తుందిట. రోజూ తలనొప్పి వస్తున్నదంటే కారణం అదేనట...." అన్నాను.

గురుమూర్తి తెల్లబోయాడు.

"ఈ విషయం డాక్టర్లకే కాదు, చాలామందికి తెలుసు. ఆమె తలనొప్పి గురించి పదిమందికీ చెప్పుకోకు" అన్నాను మళ్ళీ. ఉదయం కాఫీ కోసం భార్యను వేధిస్తున్న అతగాడిని లొంగదీయడం కోసం కాకపోతే- నేను అంతలా అతడితో మాట్లాడి వుండేవాణ్ణికాదు. నా ట్రిక్కు పని చేసింది. గురుమూర్తి ఆ క్షణంలోనే నాతో బయల్దేరి బజారుకి వచ్చి ఫ్లాస్కు ఒకటి కొన్నాడు.